పట్టభద్రుల్లో పురుషాధిక్యం

- మహిళా ఓటర్ల కంటే 4,023 మంది పురుష ఓటర్లు అధికం
- కొవ్వూరులో గరిష్టంగా 4,587 మంది ఓటర్లు
- డిసెంబర్ 9 వరకూ ఓటు నమోదుకు, ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు అవకాశం
- టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం





కొవ్వూరులో గ్రాడ్యుయేట్స్ ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కొవ్వూరు: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్కారు సమాయత్తం అవుతోంది. దీనిలోభాగంగా ప్రస్తుతం ఓటర్ల నమోదు ప్రక్రియ నడుస్తోంది. గ్రాడ్యుయేట్స్ ఓటర్ల నమోదుకు తొలుత ఈనెల 6 వరకూ ప్రభుత్వం గడువు ఇచ్చింది. దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వస్తూండడంతో ఆ గడువును 8 వరకూ పొడిగించింది. దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని భావించి డిసెంబర్ 9 తుది గడువుగా నిర్దేశించారు. ఇంతవరకూ కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 22,074 మంది గ్రాడ్యుయేట్స్ తమ ఓటు హక్కు నమోదు చేయించుకున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ అయిన ఓటర్ల జాబితాలను ఓటర్ల పరిశీలనార్థం తహసీల్దార్, ఆర్డీవో, మునిసిపల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. జాబితాలో పేరు తప్పులు ఉంటే సరిదిద్దేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వాటితో పాటు కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి సైతం డిసెంబర్ తొమ్మిదో తేదీ వరకూ అవకాశం కల్పించారు. దీంతో గ్రాడ్యుయేట్స్ ఓటర్ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది.

పురుష ఓటర్లదే ఆధిక్యం

సాధారణంగా జనరల్ ఓటర్ల జాబితాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉంటారు. గ్రాడ్యుయేట్స్ ఓటర్లు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నారు. మహిళలకు యుక్త వయసు రాగానే వివాహాలు చేయడంతో పాటు ఉన్నత చదువులు మాన్పించడం వంటి కారణాలతో గ్రాడ్యుయేషన్ చేసిన మహిళల సంఖ్య తక్కువ. ఈ క్రమంలో కొవ్వూరు డివిజన్‌లో మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. పురుష ఓటర్లు 13,047 మంది ఉంటే మహిళా ఓటర్లు మాత్రం 9,024 మంది మాత్రమే ఉన్నారు. అంటే మహిళా ఓటర్ల కంటే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పురుష ఓటర్లు 4,023 మంది అదనంగా ఉన్నారు. డివిజన్‌లో కొవ్వూరులో గరిష్టంగా 2,527 మంది, నిడదవోలులో 1,983 మంది పురుష ఓటర్లు ఉన్నారు. మిగిలిన అన్ని మండలాల్లోనూ వెయ్యి నుంచి 1,400కు పైబడి పురుష ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు మాత్రం కొవ్వూరు, నిడదవోలు మినహా మిగతా అన్ని మండలాల్లోనూ వెయ్యి లోపుగా ఉన్నారు. గోపాలపురం, తాళ్లపూడి, దేవరపల్లి మండలాల్లో 700 లోపుగా మహిళా ఓటర్లు ఉంటే, పెరవలి మండలంలో 718, నల్లజర్ల మండలంలో 874, ఉండ్రాజవరం, చాగల్లు మండలాల్లో 958, 972 మంది చొప్పున మహిళా గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు.

డివిజన్‌లో 37 పోలింగ్ కేంద్రాలు

డివిజన్‌లో గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో కొవ్వూరు మండలంలో గరిష్టంగా ఎనిమిది కేంద్రాలు ఉండగా నిడదవోలులో ఐదు ఏర్పాటు చేశారు. చాగల్లు, నల్లజర్ల, ఉండ్రాజవరం మండలాల్లో నాలుగేసి చొప్పున, ఇక దేవరపల్లి, గోపాలపురం, పెరవలి, తాళ్లపూడి మండలాల్లో మూడేసి చొప్పున పోలింగ్ కేంద్రాలను గుర్తించారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

డిసెంబర్ 5న నిర్వహించే ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కొవ్వూరు డివిజన్‌లో అధికారులు సర్వం సిద్ధం చేశారు. డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో 990 మంది టీచర్స్ ఓటర్లు ఉన్నారు. డివిజన్‌లోని ప్రతి మండలంలో ఒక్కొక్క పోలింగ్ బూత్ చొప్పున సిద్ధం చేశారు. 609 మంది పురుష ఓటర్లు, 381 మంది మహిళా ఓటర్లు 5న ఓటు వేయనున్నారు. మండలాలవారీగా కొవ్వూరులో గరిష్టంగా 227, నిడదవోలులో 204, నల్లజర్లలో 127, ఉండ్రాజవరంలో 123, చాగల్లులో 54, దేవరపల్లిలో 84, గోపాలపురంలో 51,పెరవలిలో 65, తాళ్లపూడిలో కనిష్టంగా 55 మంది చొప్పున ఓటర్లు ఉన్నారు. చాగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల, దేవరపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గోపాలపురం, కొవ్వూరుల్లో మండల పరిషత్ కార్యాలయాలు, నల్లజర్లలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నిడదవోలులో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, పెరవలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, తాళ్లపూడి పరసా పద్మ రాజరావు జెడ్పీ ఉన్నత పాఠశాల, ఉండ్రాజవరంలో తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

డివిజన్‌లో గ్రాడ్యుయేట్ల ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్ కేంద్రాలు	స్త్రీలు	పురుషులు	ఇతరులు	మొత్తం
చాగల్లు	4	1,404	972	0	2,370
దేవరపల్లి	3	1,165	697	0	1,862
గోపాలపురం	3	1,024	634	0	1,658
కొవ్వూరు	8	2,527	2,060	0	4,587
నల్లజర్ల	4	1,451	874	0	2,325
నిడదవోలు	5	1,983	1,433	1	3,417
పెరవలి	3	1,014	718	2	1,734
తాళ్లపూడి	3	1,068	678	0	1,746
ఉండ్రాజవరం	4	1,411	958	0	2,369
మొత్తం	37	13,047	9,024	03	22,074

గ్రాడ్యుయేట్స్ ఓట్ల నమోదుకు 9 వరకూ గడువు



డిసెంబర్ 9 వరకూ గ్రాడ్యుయేట్స్ తమ ఓటుహక్కును నమోదు చేయించుకోవచ్చు. ప్రస్తుతం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిదిద్దేందుకు అభ్యంతరాలను స్వీకరిస్తున్నాం. జాబితాలను ఆయా మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. ఇప్పటికే నమోదు చేయించుకున్న గ్రాడ్యుయేట్స్ జాబితాలను సరిచూసుకోవాలి. ఒకవేళ తమ పేర్లు లేకపోయినా, జాబితాపై అభ్యంతరాలున్నా తెలియజేయవచ్చు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కొవ్వూరు డివిజన్‌ను సర్వం సిద్ధం చేశాం. రెండు,మూడు రోజుల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ కుడా పూర్తి చేస్తాం.

–రాణి సుస్మిత, ఆర్డీవో, కొవ్వూరు

క్లుప్తంగా

సెపక్ తక్రా పోటీల్లో మెరిసిన రామన్నపాలెం విద్యార్థులు

జాతీయ పోటీలకు లాస్య ఎంపిక



రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో సత్తా చాటిన రామన్నపాలెం హైస్కూల్ బాలబాలికలు

దేవరపల్లి: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల బాలుర విభాగంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానం, బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించాయి. విజేత జట్లు రెండింటిలోనూ దేవరపల్లి మండలంలోని రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ బాలబాలికలు ఐదుగురు ఉన్నారు. రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ఈ నెల 26, 27 తేదీల్లో నంద్యాల జిల్లా నందికొట్కూరులో నిర్వహించారు. విజేతలైన బాలుర జట్టులో రామన్నపాలెం హైస్కూల్ విద్యార్థులు వై.అంథోనీ, ఎం.అఖిల్ సభ్యులు. అలాగే ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టులో మంచిలి లాస్య, ఎం. జేజశ్రీ , సుభాషిణి సభ్యురాళ్లు. వారిలో మంచిలి లాస్య జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ సెపక్ తక్రా బాలికల జట్టుకు ఎంపికైంది. ఈ ఐదుగురినీ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. రవీంద్రనాథ్, పీడీ టి.సరస్వతి శుక్రవారం అభినందించారు.

వైభవంగా బంగారు పాపమ్మ ఉత్సవాలు



కళాకారిణి కూచిపూడి నృత్య ప్రదర్శన

తాళ్లపూడి: అన్నదేవరపేట గ్రామస్తుల ఆరాధ్యదేవతైన బంగారు పాపమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన శుక్రవారం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. రంగురంగుల విద్యుత్ దీపాల సెట్టింగ్‌లతో ఆలయ ప్రాంగణం వెలుగొందుతోంది. రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి ప్రదర్శించిన నృత్యాంజలి కళానికేతన్ వారి కూచిపూడి నృత్య రూపకం ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


సమిశ్రగూడెం వంతెనపై ట్రాఫిక్ జామ్



సమిశ్రగూడెం వంతెన వద్ద నిలిచిపోయిన వాహనాలు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలోని పురాతన గడ్డర్ బ్రిడ్జిపై శుక్రవారం సాయంత్రం వాహనం నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో సుమారు గంటసేపు వాహనాలు వెళ్లేందుకు దారిలేకపోవడంతో తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, నిడదవోలుతో పాటు పరిసర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోజూ పాఠశాలల స్కూల్ బస్సులు వెళ్లే సమయంలో వంతెన వద్ద ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఇక్కడ గస్తీ ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

దేవరపల్లి: దేవరపల్లి–గోపాలపురం రోడ్డు పక్కనే గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. స్థానిక సుమంత్ ఆసుపత్రిలో పచ్చకామెర్ల వ్యాధికి చికిత్స పొందుతూ ఆ వ్యక్తి శుక్రవారం ఉదయం 11–12 గంటల మధ్య గోపాలపురం రోడ్డులో రహదారి పక్కనే అనారోగ్యంతో మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆసుపత్రి ఓపీ కార్డుపై జె.లక్ష్మారెడ్డి అని ఉందని, వయస్సు 45–50 ఏళ్ల మధ్య ఉంటుందని చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్ నంబరు 9440796624, 9154875590కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు లక్ష రుద్రాక్ష పూజ

కొవ్వూరు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో శనివారం హిందూ కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్టు గండ్రోతు పవన్ సోమరాజు తెలిపారు. ఈ ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్ష పూజ, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. గోపూజ, విష్ణు సహస్ర పారాయణ ,లక్ష్మీ నారాయణ పూజ, సాయంత్రం కోనేరులో దీపోత్సవం, పండిత సత్కారం నిర్వహిస్తామన్నారు. పలువురు ప్రముఖులు ఈ పూజలకు హాజరు కానున్నట్టు తెలిపారు.

7న టీచర్స్, పేరెంట్స్ భేటీ విజయవంతం చేయాలి



గోపాలపురంలో హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

గోపాలపురం: రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 7న నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ జి.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో స్థానిక జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంతో పాఠశాలల బలోపేతానికి, విద్యార్థి వికాసానికి వీలుంటుందన్నారు. అందువల్ల డిసెంబర్ 7న ప్రతి పాఠశాల్లోనూ కమిటీలు ఏర్పాటు చేయాలని ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో..

తాళ్లపూడి: మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహణపై మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం వేగేశ్వరపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులకు అవగాహన సమావేశం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సీహెచ్ బాలమణి మాట్లాడుతూ డిసెంబర్ 7న నిర్వహించే మెగా పేరెంట్స్ సమావేశంపై రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలు వివరించారన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. సమావేశంలో ఎంఈవో–2 సీహెచ్ నెహ్రూజీ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

యాప్‌లో ఇంటింటా ఆరోగ్య పరీక్షల వివరాలు



ఇంటింటా ఆరోగ్య పరీక్షల సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య

నల్లజర్ల: ప్రజారోగ్యం కోసం నిర్వహిస్తున్న ఇంటింటా వైద్య పరీక్షలను డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టరు సంధ్య పరిశీలించారు. శుక్రవారం జగన్నాథపురంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. డాక్టరు సంధ్య నేరుగా గ్రామస్తుల వద్దకు వెళ్లి ఎన్ఎస్‌డీ 3.0 కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు బీసీ, సుగర్, హిమోగ్లోబిన్, క్యాన్సర్ కారక వ్యాధులకు పరీక్షలు చేస్తున్నట్టు వివరించారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు ఇంటింటా సర్వే జరుగుతోందన్నారు. కుటుంబ సమగ్ర సమాచారం , ఆరోగ్యపరంగా కుటుంబ చరిత్ర, ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సంబంధిత సమాచారాన్ని సేకరిస్తున్నట్టు డాక్టర్ సంధ్య వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి ఆరోగ్య సమాచారంతో పాటు వారికి ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సర్వే వివరాలన్నింటినీ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ సిరాజుద్దీన్ సర్వే వివరాలు వివరించారు.

రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు



మల్లవరంలో క్యూరింగ్ చేయని సీసీ రోడ్డు

చాగల్లు: మల్లవరం గ్రామంలోని కొత్తపేటలో ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షల వ్యయంతో సుమారు 100 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణం పూర్తయి, నాలుగు రోజులు గడిచినా నేటికీ క్యూరింగ్ చేయలేదు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ శుక్రవారం ఆ రోడ్డుపై ఎండుగడ్డి వేసి తూతూమంత్రం క్యూరింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నాడు. కానీ రోడ్డు నిర్మాణంలో పర్యవేక్షణ కొరవడింది.

నాయీబ్రాహ్మణ సంఘం వన సమారాధన



దేవరపల్లిలో నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన కార్తిక వన సమారాధన

దేవరపల్లి: కార్తిక మాసం మరో రెండు రోజుల్లో ముగుస్తుండడంతో వనసమారాధన నిర్వహిస్తున్నారు. గతంలో పోల్చుకుంటే ఈ ఏడాది వనసమారాధనల సందడి తగ్గింది. మార్కెట్లో కూరగాయల ధరలు, నిత్యావసరాల ధరలు ఎక్కువగా ఉండడంతో వనసమారాధనల నిర్వహణ భారీగా మారింది. దీంతో అనేక సంఘాలు ఈ ఏడాది వనసమారాధనలకు దూరంగా ఉన్నాయి. శుక్రవారం యాదవోలు రోడ్డులో హైవే దగ్గరలోని ఆయిల్‌పామ్ తోటలో స్థానిక నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో మహిళలు, యువతీయువకులు పాల్గొని ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ సమారాధనకు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి డి. సువర్ణరాజు, టీడీపీ నాయకుడు గన్నమని హరికృష్ణ, సీపీఎం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు హాజరయ్యారు.

ఆగస్టు వరకూ జీతాలు చెల్లించాం

డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు వివరణ

సాక్షి ఇంపాక్ట్

నల్లజర్ల: 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు రెడ్ సిగ్నల్ ' పేరిట సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు స్పందించారు. డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఆగస్టు నెల వరకూ వేతనాలు చెల్లించామని ఆయన శుక్రవారం పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి గ్రాంటు విడుదల కాగానే మిగతా బకాయిలు చెల్లిస్తామన్నారు. జిల్లాలోని 13 తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలు కండిషన్‌లోనే ఉన్నాయన్నారు. ప్రజలకు ఎటువంటి ప్రతికూలత లేకుండా మాతా,శిశు సేవలు అందిస్తున్నట్టు ఒక ప్రకటనలో వివరించారు.

నేడు నిడదవోలు మున్సిపల్ సమావేశం

నిడదవోలు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు కమిషనర్ టి.కృష్ణవేణి శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఆమె కోరారు.

చివటంలో కంటి వైద్య శిబిరం



చివటంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఉండ్రాజవరం: మండలంలోని చివటం సచివాలయ ఆవరణలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్కోజో ఫౌండేషన్ (న్యూ ఢిల్లీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 36 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఐదుగురిని శస్త్ర చికిత్సలకు రిఫర్ చేయగా, 16 మందికి కళ్లజోళ్లు పడతాయని సంస్థ ప్రతినిధి జి.అజోర్ తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు రిఫర్ చేసినట్టు తెలిపారు. తెల్లరేషన్ కార్డ్ ఉన్నవారికి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేసే అవకాశం ఉందన్నారు.

సోమేశ్వరునికి మాస శివరాత్రి పూజలు



నిడదవోలులో సోమేశ్వరస్వామికి రుద్రాభిషేకం



అన్నవరప్పాడులో నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

నిడదవోలు: కార్తిక మాసంలోని మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ స్వామివారికి సహస్రనామ పూర్వక, ఏకాదశ, వార రుద్రాభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం నుంచి స్వామివారికి లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు, వేద పారాయణ, లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహశాస్త్రి, అభిరామ్ శర్మ, ఆలయ ఈవో సోమాల శివ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి అన్నాభిషేకం

తాళ్లపూడి: కార్తిక మాసం, మాస శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు అల్లూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నాభిషేకం చేశారు. అనంతరం కార్తిక అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అలాగే వేగేశ్వరపురంలోని గోదావరి నది ఒడ్డున కూడా అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

నందీశ్వరునికి అభిషేకం

పెరవలి: అన్నవరప్పాడు ఉమా విశ్వేశ్వరస్వామి ఆలయంలోని నందీశ్వరునికి గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన కోటిపల్లి గంగన్న కుటుంబీకులు అభిషేకం నిర్వహించారు. అభిషేకానికి శివ స్వాములతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు కూడా తరలివచ్చారు. ముందుగా గణపతి పూజ, అనంతరం నందేశ్వరుడకి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.ఆలయంలో నందీశ్వరుని విగ్రహాన్ని కోటిపల్లి గంగన్న ప్రతిష్ఠించారు. ఈ వేడుకలో అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, దొంగరావిపాలెం, ఖండవల్లి, పిట్టల వేమవరం గ్రామాల నుంచి సుమారు 500 మంది భక్తులు పాల్గొన్నారు.



నల్లజర్ల మండలం అనంతపల్లి వేగిలింగేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవం

నల్లజర్ల: అనంతపల్లిలోని బాలాత్రిపుర సుందరీ సమేత వేగిలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం రాత్రి వైభవంగా దీపోత్సవం నిర్వహించారు. అర్చకుడు గూడూరి రమేష్ ఆధ్వర్యంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు పండ్ల రసాలతో అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవం జరిగింది. ఆలయ ప్రాంగణంలో శివలింగం, ఓంకారం, స్వస్తిక్, అమ్మవారి ఆకారాలలో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

ఉండ్రాజవరం: పాలంగి గ్రామంలో కొలువైన రామలింగేశ్వరసామి వారికి శుక్రవారం సాయంత్రం వైభవంగా శాంతి కల్యాణం నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా అర్చకుడు రఘు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం విఘ్నేశ్వర పూజ, మహాన్యాసం, స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు, జ్యోతిర్లింగార్చన జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఏవో ఎంవీ రామయ్య, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో కనక దుర్గమ్మకు అన్నాభిషేకం

వరికోతలు వాయిదా వేసుకోవాలి

నిడదవోలు రూరల్: దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రానున్న రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉండడంతో వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం, డి.ముప్పవరం, సింగవరం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు మండల పరిధిలో 16,716 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేయగా ఇప్పటి వరకూ సుమారు 10,500 ఎకరాల్లో వరి కోతలు పూర్తిచేశారన్నారు. గోనెసంచులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు శివనాగు, మాధవన్, రైతులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీపై కేసు

కొవ్వూరు: స్థానిక భవానీ కరాచీ స్వీట్స్‌లో పని చేస్తున్న చీడం వీరేంద్రకు చెందిన సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. ఈనెల 23న స్వీట్ స్టాల్‌కు వచ్చిన ఒక వ్యక్తి ఫోన్ చేసుకుని ఇస్తానని వీరేంద్ర సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. షాపులో పనిలో ఉన్న వీరేంద్ర సెల్‌ఫోన్ తీసుకున్న వ్యక్తి బయటికి వెళ్లడం గుర్తించలేదు.కొద్ది సేపటి తర్వాత సెల్‌ఫోన్ చోరీకి గురైనట్టు తెలుసుకుని పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి కేసు నమోదు చేశారు.